వైఎస్ జగన్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నిర్వహించనున్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరులోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులతో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో స్మృతి వన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు వెచ్చించి 125 అడుగుల ఎత్తుతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా 19 ఎకరాల్లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికోసం కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు, స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పదవుల్లో రిజర్వేషన్ కన్నా అధిక స్థానాలు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ప్రతిపక్షాలవి నిరాధార ఆరోపణలు

ప్రతిపక్షపార్టీలు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఒకరి మెప్పు కోసం పని చేసే వ్యక్తిని కాదని, న్యాయం కోసం పని చేస్తానని చెప్పారు. గోరుకలు రిజర్వాయర్ కట్ట నిర్మించడంతో పాటు 7 టీఎంసీల నుంచి 11 టీఎంసీలకు సామర్థ్యం పెంచామన్నారు. ఆయకట్టు కింద రెండో పంటకు నీరు అందిస్తున్నామన్నారు. గత పాలకులు రిజర్వాయర్‌కు షటర్లు కూడా నిర్మించలేదని గుర్తు చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డుల్లో రూ. 220 కోట్లతో ప్రాధాన్యతలను అనుసరించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్, చెన్నమ్మ సర్కిల్‌లో ఫ్లై ఓవర్లు, అలాగే వెంకటరమణ కాలనీలో నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తి చేశామని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హుస్సేన్‌బీ, డీపీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు సుకుమార్, యూనస్, మునిస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న గోపూజ



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకట రెడ్డి

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గోపూజ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంకల్ భాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాల్లో కనుమ పశువుల పండుగ అన్నారు. కల్లూరులోని అవధూత రామిరెడ్డి తాత సంస్థాన్‌లో కనుమ రోజు ఉదయం 9 గంటలకు ముక్కోటి దేవతా స్వరూపమైన గోవుకు సామూహిక పూజ నిర్వహిస్తున్నామన్నారు. సేవా సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అదే రోజు నగర సంకీర్తన, శోభాయాత్ర, ధార్మిక ప్రవచనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు అనంత అనిల్ కుమార్, పసుపులేటి నీలిమ, హనుమంతరెడ్డి, కోదండం, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెడితే ఒక్కో ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు వేతనం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షతన ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీలో అమలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, గూడూరు రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

దామోదరం మరణం పార్టీకి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్) : జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు డి.దామోదర్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు.ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. దామోదరం మృతి పార్టీకి తీరని లోటని చెప్పారు.

22న హంపి పీఠాధిపతి రాక

కోడుమూరు రూరల్ : ఈనెల 22వ తేదీన హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి కోడుమూరుకు విచ్చేయనున్నట్లు భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరులో దాతల సహకారంతో రూ.10 కోట్ల వ్యయంతో పునర్నిర్మిస్తున్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వా మి ఆలయానికి సంబంధించి ఉత్తర ద్వారాన్ని పీఠాధిపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

నారాయణలో సంక్రాంతి సంబరం



కర్నూలు సిటీ: స్థానిక మాధవినగర్, గాయత్రి ఎస్టేట్‌లలోని నారాయణ స్కూళ్లలో సోమవా రం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో రంగవల్లుల వేయించి గాలిపటాలు ఎగిరించారు. పండుగ వాతావరణం ఉట్టిపడేలా భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో ఆయా స్కూళ్ల ప్రిన్సిపాల్స్ మహమ్మద్ అల్తాఫ్, ఇ.నిజేంద్రగౌడ్, ఏజీఎం రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): అర్జీదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవతేజ వెల్లడించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని సమావేశ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారుల ఫిర్యాదులు, వినతులను కమిషనర్ స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు అక్కడికక్కడే ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ప్రజా వినతులు ఇవే...

- తమ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు ఏర్పాటు చే యాలని సరస్వతి నగర్‌కు చెందిన కౌసల్య, ప్రేమనగర్‌కు చెందిన సుజాత వేర్వేరుగా అర్జీలు అందజేశారు.
- తమ ఇంటి వద్ద మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటరమణ, అలాగే ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన వెంకటేశ్వరప్రసాద్ అర్జీలు సమర్పించారు.
- తమ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సోమిశెట్టి నగర్‌కు చెందిన అశోక్‌కుమార్ కోరారు.
- టిడ్కో ఇళ్లు కేటాయించాలని ఛత్రీబాగ్ వీధికి చెందిన మహేశ్వరి వినతిపత్రం అందజేశారు.
- డబ్బులు చెల్లించినా తమకు టిడ్కో గృహం కేటాయించలేదని ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన అబ్దుల్ లతీఫ్ విన్నవించారు.

ఆక్రమణల తొలగింపు

కర్నూలు (టౌన్): నగరంలోని పలు ప్రాంతాల్లో గుర్తించిన ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సోమవారం సాయంత్రం కూల్చివేశారు. స్థానిక వెంకటరమణ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలు, ర్యాంప్, అలాగే రామలింగేశ్వర్ నగర్‌లో ఆక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించారు. లోకాయుక్త ఆదేశాల మేరకు వాటిని తొలగించినట్లు పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉంటే నగర శివారులోని జగన్నాథ గట్టుపై టిడ్కో ఇళ్ల సమీపంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం సర్వే చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరీష్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం వాయిదా..

నగరపాలక సంస్థ పరిధిలోని ఐటీసీ సర్కిల్ వద్ద నిర్మించిన హాకర్స్ జోన్ కేటాయించేందుకు ఈనెల 9వ తేదీ నిర్వహించాల్సిన బహిరంగ వేలాన్ని 11వ తేదీకి వాయిదా వేసినట్లు నగరపాలక కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య పర్యవేక్షణాధికారిగా సత్యనారాయణ మూర్తి

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థకు పారిశుధ్య పర్యవేక్షణాధికారిగా అనంతపురం మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులు సత్యనారాయణమూర్తిని సోమవారం సాయంత్రం నియమించారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు కోటేశ్వర రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు జారీ చేయడంతో ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. నగరంలో పారిశుధ్య పనులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సాహితీ కృషీవలుడు!

- తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారానికి డాక్టర్ పోతన్న ఎంపిక
- వందల సంఖ్యలో జానపద కథలు, పాటల రచన
- పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు కైవసం
- 26 ఏళ్లు ఆకాశవాణి వ్యాఖ్యాతగా విధుల నిర్వహణ



పోతన్న

కర్నూలు కల్చరల్: జిల్లా సాహితీ వేత్త డాక్టర్ వి.పోతన్న 'తెలుగు భాషా సేవ ప్రతిభా పురస్కారానికి ఎంపిక అయ్యారు. తెలుగు భాషా వికాసానికి ఆయన చేస్తున్న సేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. మంగళవారం అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న అనంత తెలుగు భాషా వైభవ సదస్సులో ఆయనకు పురస్కారం ప్రధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ బాబు పోతన్నకు సోమవారం ఆహ్వాన పత్రం కూడా పంపారు. సాహిత్య సేవకు గుర్తింపుగా తనకు పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా పోతన్న పేర్కొన్నారు.

నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేవ..

డాక్టర్ వి. పోతన్న కర్నూలు, అనంతపురం ఆకాశవాణి కేంద్రాల్లో 26 సంవత్సరాలు వ్యాఖ్యాత (అనౌన్సర్)గా పనిచేసి 2017లో పదవీ విరమణ పొందారు. ఈయన 1992లో అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి 'హరిజనాభ్యుదయం – తెలుగు నాటకం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. రచన, నటన, గానం, సాహిత్యం, జానపద కళలు, సామాజిక, సాహిత్య ఉపన్యాసాలు ప్రవృత్తిగా కలిగి ఉండి సాహిత్య సేవలో గుర్తింపు పొందారు.

వరించిన పురస్కారాలు

నాలుగు దశాబ్దాలుగా సాహిత్య సేవతో పోతన్న పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్నారు. జానపద గేయ కావ్యం, కాకిమాట– కోకిల పాటకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ సమైకృత అవార్డు, జానపద గేయం గంగ పొంగుకు సిలికానాంధ్ర నుంచి బహుమతి, పత్తి రైతు జీవితం ఆధారంగా రాసిన యాట్టా సేయాలబ్బా నాటికకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పురస్కారం, కుటుంబ ఆరోగ్యం – దేశ సౌభాగ్యం బుర్రకథకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుటుంబ సంక్షేమ శాఖ నుంచి పురస్కారం, ఏపీ చలన చిత్ర, టెలివిజన్ , నాటక రంగ సంస్థతో ఉత్తమ నాటిక రచయిత అవార్డు ఇలా పలు పురస్కారాలు ఆయనకు వరించాయి. 300 పైగా జానపద, లలిత గేయాలు రాశారు.

ఇందులో 'వేమన మాట ప్రగతికి బాట' 5 సంవత్సరాలు, మహా భారత గాథలు ధారావాహికంగా 8 సంవత్సరాలు, కథ చెబుతాను ఊ కొడతారా ధారావాహికంగా 5 సంవత్సరాలు కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో ప్రసారమయ్యాయి.

ఈ రోజు

కేంద్ర మంత్రి రాక

కర్నూలు కల్చరల్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యపాల్ సింగ్ భగేల్ మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు సాయి ప్రదీప్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు మండలం గార్గేయపురం గ్రామం, సాయంత్ర 6 గంటలకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు నందవరం మండలం, మధ్యాహ్నం 3 గంటలకు హొళగుంద మండలం గజ్జహల్లి గ్రామం, 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు తుగ్గలి మండలం పగడ్రాయి గ్రామంలో పర్యటిస్తారని పేర్కొన్నారు.

పెద్దాసుపత్రి సందర్శన

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ భగేల్ నేడు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రానున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఆయన సాయంత్రం ఆసుపత్రిని సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును తెలుసుకోవడంతో పాటు పలు విభాగాల తనిఖీ చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ఎస్టీయూ భవనంలో రక్తదానం

కర్నూలు సిటీ: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ జిల్లా శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్ తెలిపారు. సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు పార్లమెంటు సభ్యుడు డా.సంజీవ్‌కుమార్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటన

కర్నూలు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలు జిల్లాలో పర్యటించనున్నట్లు కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కోడుమూరు, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తారన్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లపై కర్నూలు పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్, కార్యదర్శి శ్రీనివాస్ భట్ తదితరులతో కలిసి అడిషనల్ ఎస్పీని కలసి వినతిపత్రం సమర్పించామన్నారు.

సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షాలేమురాజు



ఎన్నికైన నూతన సిటీ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు (టౌన్) : నగర పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెవరెండ్ వి.షాలేమురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక బుధవారపేటలోని గుడ్ షెప్పర్డ్ చర్చిలో చీఫ్ ప్యాట్రన్ రెవరెండ్ ఆర్.ఆర్.డి. సజీవరాజు ఆధ్వర్యంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిటీ పాస్టర్స్ నూతన అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. ఈ అసోసియేషన్‌లో రెవరెండ్ జి. కిషోర్ (ఉపాధ్యక్షుడు), రెవరెండ్, ఆర్. దాసు (కార్యదర్శి), రెవరెండ్ వి.ఎస్. రవికుమార్ (కోశాధికారి), రెవరెండ్ డి. జయకుమార్ (అసోసియేట్ కోశాధికారి), కమిటీ కార్యవర్గ సభ్యులుగా రెవరెండ్ సి. హెచ్. రవీంద్ర, రెవరెండ్ యం. కిరణ్‌కుమార్, రెవరెండ్ ఐజక్ సన్నీ, రెవరెండ్ ఎస్. రాజు, రెవరెండ్ ఎస్. జాన్ బెనహర్‌ను ఎన్నుకున్నటు జిల్లా పీస్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బిషప్ అమ్రోజ్ వెల్లడించారు.


కడుపులో నులిపురుగులతో రక్తహీనత



విద్యార్థులకు సూచనలు చేస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల పిల్లల్లో రక్తహీనత వస్తుందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత చెప్పారు. సోమవారం ఆమె ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవమడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నులిపురుగులపైన అవగాహన కల్పించారు. నులిపురుగుల వ్యాధి లక్షణాలు, అవి వ్యాపించే విధానం, వాటి నివారణ పద్ధతుల గురించి విపులంగా వివరించారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే అతిగా ఆకలి వేయడం లేదా ఆకలి లేకపోవడం, రక్తహీనత, దురద, దగ్గు, వికారం, వాంతులు లాంటి సమస్యలు ఉంటాయని తెలిపారు. పండ్లు, కూరగాయలు పరిశుభ్రంగా కడిగిన తర్వాతనే వాటిని వినియోగించాలని తెలిపారు. అపరిశుభ్ర ప్రాంతాల్లో ఆహారం తీసుకోకూడదన్నారు. విద్యార్థులు బయట వండిన ఆహార పదార్థాలు , జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, ఎక్కువగా ఇండ్లలో తయారు చేసిన ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల హెడ్‌మాస్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రగ్బీ విజేతలు ఆదర్శ, గుడ్ షప్పర్డ్ స్కూళ్ల జట్లు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుడ్ షప్పర్డ్ స్కూల్

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రగ్బీ అండర్-14 బాల బాలికల పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో ఆదర్శ విద్యా మందిర్ జట్టు మొదటి స్థానం, నారాయణ స్కూల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో గుడ్ షప్పర్డ్ స్కూల్ మొదటి స్థానం, బ్రేక్‌త్రూ స్కూల్ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): రెండు రోజుల్లో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. సమ్మెలో భాగంగా సోమవారం అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఉప కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లాప్రధాన ఎండీ అంజిబాబు, నాయకులు సుధాకరప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

20వ రోజు కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరుకుంది. సోమవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న మాట్లాడుతూ..ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కర్నూలు : పంచలింగాల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన కృష్ణమూర్తికి కొడుకు, కూతురు సంతానం. కుమారుడు భరత్ కుమార్ (22) పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి కర్నూలుకు వస్తుండగా పంచలింగాల రోడ్డులోని బీఆర్ రెడ్డి ఫ్యాక్టరీ వద్ద బైకు అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'డప్పు పండుగ'ను జయప్రదం చేయండి

కల్లూరు: ఈ నెల 10 నుంచి 13 వరకు జిల్లాలో జరిగే డప్పు పండుగ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్రం అధ్యక్షుడు ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు, జిల్లా నాయకులు చక్రపాణి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. జనవరి 10, 11న కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు సంబంధించిన డప్పు పోటీలను పెద్దపాడులో, 12, 13న గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, కౌతాళం మండలాలకు సంబంధించిన డప్పు పోటీలను ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, దాసు, రాముడు, యేసు, చిరంజీవి, మద్దిలేటి, రత్నం, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా తిరిగి రండి



క్లస్టర్ యూనివర్సిటీ జట్టును అభినందిస్తున్న వీసీ సాయిగోపాల్

కర్నూలు (టౌన్) ఈనెల 8 నుంచి 16 వ తేదీ వరకు చెన్నై రాష్ట్రంలోని హిందూస్తాని విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా తిరిగి రావాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సాయిగోపాల్ అన్నారు. సోమవారం ఆ వర్సిటీ ప్రాంగణంలో క్రికెట్ జట్టు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

100 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గ్రామాలన్నింటిలో వివిధ రకాల పింఛన్ల పంపిణీ సోమవారంతో 100 శాతం పూర్తి అయ్యింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను విడతల వారీగా రూ.3 వేలకు పెంచారు. పెంచిన పింఛన్ కానుకలను ఈ నెల 6న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదే విధంగా కొత్తగా మంజూరైన పింఛన్లను సైతం అందజేశారు.

పార్కులు ఏర్పాటు చేయాలి

కల్లూరు: పార్కులను ఏర్పాటు చేయాలని కల్లూరు అర్బన్ నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం కాలనీ ఇంటి యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.నాగరాజు ఆధ్వర్యంలో కాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేసి ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.